కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయింపు

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్

- ఇతర కేటగిరీ అభ్యర్థులకు ఆన్‌లైన్ విధానంలో...
- 13వ తేదీ నుంచి పాఠశాలలకు టీచర్లు


ఎస్జీటీ కౌన్సెలింగ్‌లో డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆప్షన్స్ ఫారం అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 234 మందికి సబ్బవరం, పెందుర్తిల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ విశాఖపట్నం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి ఏజెన్సీ, మైదానంలోని ప్రాథమిక పాఠశాలల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఎక్కువగా ఏజెన్సీలో ఖాళీలను భర్తీచేశారు. అలాగే స్కూల్ అసిస్టెంట్/తత్సమాన కేటగిరీలో 495 ఖాళీలకు అభ్యర్థులు గురువారం వెబ్‌ఆప్షన్స్ ఇవ్వగా, వారికి శుక్రవారం పాఠశాలలు కేటాయించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కేటగిరీలు కలిపి 400 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. పాఠశాలల కేటాయింపునకు సంబంధించి ఉత్తర్వులు అభ్యర్థుల మెయిల్స్‌కు పంపారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు ఈనెల 13వ తేదీ (సోమవారం)న విధుల్లో చేరనున్నారు. మెగా డీఎస్సీలో చివరి అంకం శిక్షణ విజయవంతంగా ముగిసిందని, అనంతరం పాఠశాలలు కేటాయింపు పూర్తిచేశామని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టనున్న ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కాగా, డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లకు ఈ నెల మూడో తేదీ నుంచి శుక్రవారం వరకూ శిక్షణ ఇచ్చారు.


కొత్తగా నియమితులైన టీచర్లతో డీఈవో ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు

స్వచ్ఛాంధ్ర పనుల్లో వేగం

గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు అధిక ప్రాధాన్యం

- జిల్లాకు కొత్తగా 113 సామూహిక మరుగుదొడ్లు మంజూరు
- ఒక్కోదానికి రూ.3 లక్షలు కేటాయింపు
- ఇప్పటికే 72 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి
- 158 అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం..
- 746 కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు


దేవరాపల్లిలో నిర్మించిన సామాజిక మరుగుదొడ్ల సముదాయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
స్వచ్ఛ ఆంధ్ర సాధనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లాలో పలు గ్రామ పంచాయతీలు పరిశుభ్రత పనులు చేపట్టడంలో ముందు వరుసలో ఉండడంతో ఇటీవల పురస్కారాలను సొంతం చేసుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గ్రామ పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులు సైతం ఇతరత్రా పథకాలకు మళ్లించిన సంగతి తెలిసిందే. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఉన్న సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టకపోగా, కొత్తవి నిర్మించాలనే ఆలోచనే చేయలేదు. దీంతో అనేక గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వచ్ఛ భారత్ మిషన్-2.0, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపు కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించింది. తొలి విడతలో ఐదు వేలు, అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో వీటి నిర్మాణాలు చేపడుతున్నారు ఇంకా వ్యక్తగత మరుగుదొడ్లను నిర్మించనున్నారు. ఎంపీడీఓల నివేదికల ప్రకారం జిల్లాలో 113 సామూహిక మరుగుదొడ్లను నిర్మించేందుకు ప్రతి మరుగుదొడ్డికి రూ.3 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 72 మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో వున్నాయి. ఇంకా 158 అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణాల్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36 వేలు ఖర్చు చేస్తున్నారు. గృహ అవసరాలకు వినియోగించే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేస్తున్నారు. 2014-2019 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 60 శాతానికి పైగా గృహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకం అటకెక్కింది. కూటమి అధికారంలోకి రావడంతో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలకు కొత్తగా ఓడీఎఫ్ కింద మరుగుదొడ్లను నిర్మించుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నది. ఒక్కో మరుగుదొడ్డికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. తొలివిడలో 746 కుటుంబాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరు చేసింది. ఆయా పనులు జోరుగా సాగుతున్నాయిని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు.


సబ్బవరం మండలం ఆరిపాక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి

పరిశ్రమలకు రెడ్ కార్పెట్

భూముల కేటాయింపు, రాయితీల కల్పన

- ఎస్ఈజడ్‌లో సన్వీరా ఇండస్ట్రీస్ కార్బన్ కాంప్లెక్స్
- 122.01 ఎకరాలు కేటాయింపు
- రూ.260 కోట్ల పెట్టుబడి, 800 మందికి ఉద్యోగాలు
- పరవాడ ఫార్మాసిటీలో ఎంఎన్ఆర్ కంపెనీ
- రూ.160 కోట్ల పెట్టుబడి, 198 మందికి ఉద్యోగాలు
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం



అచ్యుతాపురం మండలంలో ప్రత్యేక ఆర్థిక మండలి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు, భూములను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాలో పలు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఆమోదం తెలిపింది.

పరవాడలోని ఫార్మాసిటీలో ఎంఎన్ఆర్ ఫార్మా కంపెనీ ఏర్పాటులో జరిగిన జాప్యంపై గతంలో విధించిన రూ.18.09 కోట్ల జరిమానా మినహాయింపునకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ కంపెనీ రూ.160 కోట్ల పెట్టుబడులతో 22.18 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. కంపెనీలో 198 మందికి ఉపాధి కల్పిస్తారు.

పరిశ్రమల అభ్యర్థనల మేరకు పలు రాయితీలు కల్పిస్తూ మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసింది. నక్కపల్లిలో రూ.55 వేల కోట్లతో ఏర్పాటు కానున్న ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ కోసం దశల వారీగా కేటాయించిన భూమికి చెల్లింపులపై రూ.12.58 కోట్లు వడ్డీ మినహాయింపు ఇచ్చింది.

పారిశ్రామిక విస్తరణలో భాగంగా అచ్యుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండలిలో 122.01 ఎకరాల్లో సన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ రూ.260 కోట్లతో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పరిశ్రమ ఏర్పాటైతే 800 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎకరాకు రూ.80 లక్షల రాయితీతో కంపెనీకి భూములను కేటాయించనున్నారు. ఈ పరిశ్రమలో కార్బన్ క్యాథోడ్స్ గ్రాఫైట్ ఎలక్ట్రోడ్స్ స్పెషాలిటీ ఉత్పత్తులు తయారవుతాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసు చేసిన విధంగా రూ.87,520 కోట్ల పెట్టుబడులతో రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడుచోట్ల 480 ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పవర్డ్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నది. ఇందులో ఒకదానిని అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేస్తారు. ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా మరి కొంతమందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఈ-పవర్డ్ డేటా సెంటర్‌కు రాంబిల్లిలో 80 ఎకరాలను కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

సర్పాలతో అప్రమత్తం


వర్షాకాలంలో అధిక బెడద

- నాలుగు రకాల సర్పాలే అత్యంత విషపూరితమైనవి
- పాముకాటు బాధితుల్లో ఎక్కువ మంది రైతులే
- పాము కాటు వేస్తే.. సత్వరమే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లాలి
- మూఢనమ్మకాలు, నాటువైద్యంతో ప్రాణాలకే ముప్పు
- అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఎస్‌వీ ఇంజక్షన్లు


నాగుపాము

చోడవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):
వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే సమయం ఇది. అన్నదాతలు రోజూ పొలానికి వెళుతుంటారు. వర్షాకాలంలో పాములు నివాసం వుండే ప్రదేశాలు ముంపునకు గురవడంతో అవి సురక్షితమైన ప్రదేశాలకు మకాం మారుస్తుంటాయి. ఈ క్రమంలో రైతులకు విష సర్పాల ముప్పు పొంచి వుంటుంది. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా ప్రాణాపాయం సంభవిస్తుంది. అయితే జిల్లాలో సంచరిస్తున్న పాముల్లో నాలుగు రకాలు మాత్రమే విషపూరితమైనవని కింగ్ కోబ్రా సంరక్షణ సంస్థ వ్యవస్థాపకులు మూర్తి కంటిమహంతి చెబుతున్నారు. పాములబారిన పడకుండా ఏయే జాగ్రత్తలు పాటించాలి? ఒకవేళ పాము కాటువేస్తే ప్రాణాపాయం నుంచి బయట పడడానికి ఏం చేయాలి? వంటి వాటి గురించి ఆయన తెలిపిన సమాచారం..

పొలాల్లో పనిచేసే సమయంలో, కల్లాల వద్ద నిద్రలో ఉన్నప్పుడు, చీకట్లో పొలాలకు వెళ్లే సమయంలో రైతులు పాము కాటుకు గురవుతున్నారు. చాలామంది తమను పాము కాటే వేసిన విషయాన్ని కూడా గమనించలేని పరిస్థితి ఉంటుంది. కుట్టింది ఏ పాము అయినా, ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లే ప్రయత్నం చేయాలి.


మూర్తి కంటిమహంతి, కింగ్ కోబ్రా సంరక్షణ సంస్థ ఫౌండర్

నాలుగే విష సర్పాలు

మన పరిసరాల్లో సంచరించే పాముల్లో నాగు పాము, కట్ల పాము, పొడ పాము, రక్త పింజర మాత్రమే విషపూరితమైనవి. రక్త పింజర కాటు వేస్తే రక్త ప్రసరణ పడిపోతుంది. కాటు వేసిన సెకన్ల వ్యవధిలోనే శరీరంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయి. నాగు పాము విషం చాలా త్వరగా రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. తక్షణమే వైద్య సేవలు అంద కపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. నీటికొయ్యలు, జెర్రిగొడ్డు, పసిరికపాము, దుండు పాముల వల్ల వెంటనే అపాయం వుండదు. ఒక వేళ ఈ పాములు కుడితే ఏఎస్‌వీ ఇంజక్షన్‌లు తప్పక వేయించుకోవాలి. కాస్త ధైర్యంగా ఉండి గంట లోపల ఆస్పత్రికి చేరుకుని వైద్య సేవలు పొందాలి. లేకపోతే వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారు ఇబ్బంది పడతారు.

పాము కాటేసిన విషయాన్ని ఎలా గుర్తించాలి..

గాఢ నిద్రలో ఉన్నప్పుడు, వేగంగా నడిచి వెళుతున్నప్పుడు, చీకటి ప్రదేశాల్లో పాము కాటు ... మిగతా 8వ పేజీలో

పీపీపీ విధానంపై జగన్‌రెడ్డికి అవగాహన లేదు

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

- జగన్ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

రావికమతం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంపై మాజీ సీఎం జగన్‌రెడ్డికి ఏమాత్రం అవగాహన లేదని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. అనకాపల్లి జిల్లా రావికమతంలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ విధానంపై అవగాహన లేకనే జగన్మోహన్‌రెడ్డి నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్...తిరిగి మెడికల్ కాలేజీల పేరుతో మరోమారు ప్రజలను మభ్యపెట్టి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చాలని యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీలు కనీసం 20 శాతం కూడా పూర్తికాలేదన్నారు. 'ఏ ప్రభుత్వం వచ్చినా మోయలేనన్ని అప్పులు చేశావు. ఒక్క రోడ్డయినా వేశావా? ఒక్క గొయ్యనైనా పూడ్చావా?, ఏం అభివృద్ధి చేశావని ప్రజల వద్దకు వచ్చావు? అంటూ జగన్‌ను ఆయన ప్రశ్నించారు. కొవిడ్ సమయంలో వైద్యులకు మాస్కులు కూడా ఇవ్వలేని పాలన సాగించిన జగన్‌కు ... మిగతా 8వ పేజీలో

గోతుల్లో కూరుకుపోయిన లారీలు

ఎం.కోడూరు వద్ద రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు, ప్రయాణికులు

మాడుగుల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రహదారిలో మాడుగుల మండలం ఎం.కోడూరు వద్ద భారీ గోతుల్లో శుక్రవారం ఉదయం లారీ, మినీ వ్యాన్ కూరుకుపోయాయి. రెండు వాహనాలు పక్కపక్కనే బురదలో దిగబడిపోవడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ... మిగతా 8వ పేజీలో


నిలిచిపోయిన వాహనాలు


ఎం.కోడూరు వద్ద గోతుల్లో దిగబడిన వాహనాలు

రౌడీషీటర్ హత్య

స్వస్థలం విజయవాడ

- హంతకుడు విశాఖ వాసి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం
- ఎలమంచిలి సమీపంలో పోలవరం కాలువ వద్ద మృతదేహం గుర్తింపు
- నాలుగు రోజుల క్రితం ఇద్దరూ కలిసి కోర్టుకు హాజరు
- అనంతరం మహిళ విషయమై గొడవ
- ఈ క్రమంలోనే విజయవాడ వాసిపై కత్తితో దాడి




పోలవరం కాలువ గట్టుపై ఉన్న మృతదేహం. (ఇన్‌సెట్‌లో) కశింకోట శ్రీధర్‌బాబు (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):
ఇద్దరు రౌడీషీటర్ల మధ్య తలెత్తిన వివాదం అనుకోకుండా ఒకరి మృతికి దారితీసింది. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి విశాఖపట్నంలోని ఎంవీపీ స్టేషన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ నగరానికి చెందిన ఎన్.గౌరీశంకర్‌పై రౌడ్ షీట్ ఉంది. దీంతో పోలీసులు కొంతకాలం క్రితం నగర బహిష్కరణ చేయడంతో ఎలమంచిలి వచ్చి ఉంటున్నాడు. అతనికి గతంలో విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్ పేటకు చెందిన పాత నేరస్థుడు కశింకోట శ్రీధర్‌బాబు(35)తో పరిచయం ఏర్పడింది. ఒక చోరీ కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరుకావడానికి ఈ నెల 7వ తేదీన ఇద్దరూ కలిసి కారులో విశాఖ వెళ్లారు. కేసు వాయిదా అనంతరం సీతమ్మధార రైతుబజార్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తరువాత ఒక మహిళ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గౌరీశంకర్ తన వద్ద ఉన్న కత్తితో శ్రీధర్‌బాబు చేతిపై తీవ్రంగా గాయపరిచాడు. రక్తస్రావం అవుతుండడంతో ఇద్దరూ కలిసి కారులో సమీపంలోని ఆస్పత్రికి వెళ్లారు. శ్రీధర్‌బాబు గాయానికి కుట్లు వేసిన ... మిగతా 8వ పేజీలో

సెజ్‌కు భూములిచ్చిన రైతులు త్యాగధనులు

▸ చిప్పాడ నిర్వాసితులకు పునరావాస పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్

▸ వైసీపీ ప్రభుత్వంలో వీరికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన ▸ కూటమి ప్రభుత్వంలో మంచిరోజులని వెల్లడి



పట్టాలు పొందిన చిప్పాడ నిర్వాసితులతో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు

అచ్యుతాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)కి భూములిచ్చిన రైతులు త్యాగధనులని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అభినందించారు. నిర్వాసిత గ్రామమైన చిప్పాడ రైతులకు శుక్రవారం ఆయన పునరావాస పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సుమారు 24 గ్రామాల రైతులు సెజ్‌కు భూములివ్వడం వల్లే ఈ ప్రాంతం ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. సెజ్ రాకతో ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయని ఆనందం వ్యక్తం చేశారు. కానీ భూ దానం చేసిన నిర్వాసిత రైతులకు మాత్రం వైసీపీ ప్రభుత్వంలో న్యాయం జరగలేదని వాపోయారు. చిప్పాడ పంచాయతీ పరిధిలో చాలామంది నిర్వాసిత రైతులకు పునరావాసం కోసం స్థలాలు మంజూరు చేయలేదన్నారు. దీంతో అంతా ఇంతవరకు దుర్భర జీవితం అనుభవించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అందరి అవస్థలను దృష్టిలో ఉంచుకొని వెదురువాడలో పునరావాసం కల్పిస్తూ పట్టాలను పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, కూటమి నాయకులు రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, రాజాన సన్యాసినాయుడు, రాజాన రామునాయుడు బీఏ రమణ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో స్థానికులకు అవకాశాలు కల్పించండి

కర్మాగారాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సూచించారు. ఇక్కడి ఏపీఐఐసీ కార్యాలయంలో సెజ్ కర్మాగారాల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములు త్యాగం చేయడం వల్లే కర్మాగారాలు వచ్చాయన్నారు. అందువల్ల ముందుగా వారికి ఉపాధి కల్పించాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పించిన తర్వాతే ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాలని స్పష్టం చేశారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుదల

▸ అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



జీఎస్టీ సంస్కరణలపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చలపతిరావు, తదితరులు

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలు అన్నివర్గాలకు ఎంతో లాభదాయకమని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులకు శుక్రవారం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన సంస్కరణల వలన అన్ని వస్తువుల ధరలు అందుబాటులోకి వస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో ఎన్నెన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం జీఎస్టీ సంస్కరణలు పేర్కొంటూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి, జిల్లా ప్రతినిధులు కొఠారు సాంబ, రాజాన సూర్యనాగేశ్వరరావు, దంట్ల వెంకటస్వామి, బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవి, ఆడారి రమణబాబు, దాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెడుగుడు పోటీల విజేత వాడ్రాపల్లి



వాడ్రాపల్లి జట్టు ప్రతినిధికి బహుమతి అందిస్తున్న గ్రామ పెద్దలు

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపపాలెం గ్రామ దేవత మరిడిమాంబ జాతరను పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు ముగిశాయి. వాడ్రాపల్లి జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలలు నుంచి మొత్తం పదహారు జట్ల క్రీడాకారులు హాజరయ్యాయి. గురువారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో ప్రథమ స్థానంలో వాడ్రాపల్లి, ద్వితీయ స్థానంలో చూచుకొండ, తృతీయ స్థానంలో గణపర్తి జట్లు నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దల చేతులమీదుగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

'సమష్టి కృషితో క్రీడాకారులు రాణించాలి'



హాకీ క్రీడాకారులకు సూచనలిస్తున్న పుష్పలత

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సమష్టి కృషితో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఏజీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.పుష్పలత సూచించారు. నక్కపల్లిలో అండర్-17 హాకీ క్రీడాకారుల ఎంపికను శుక్రవారం పరిశీలించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించి నక్కపల్లిలో జరిగిన ఎంపికల్లో 120 మంది హాకీ క్రీడాకారులు పాల్గొనడం సంతోషమన్నారు. రాష్ట్ర స్థాయికి బాలికలు, బాలుర నుంచి రెండు జట్లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులను బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, సెక్రటరీ తాతాజీ, ఎస్జీఎఫ్ కార్యదర్శి జి.రాంబాబు, కోచ్ రాంబాబు తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన షేక్ నౌషద్, దిమిలి యోగి

ఎస్.రాయవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ నౌషద్, దిమిలి యోగి రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రేవుపోలవరం సముద్రతీరం వద్ద జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. దీంతో వీరిని శుక్రవారం హెచ్ఎం జాన్, వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

వైసీపీ కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వైసీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బోదెపు గోవింద్ ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాయకులు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, దాసరి కుమార్, దూది నరసింహమూర్తి, రాపేటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి : బొడ్డేడ

మునగపాక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ బకాయిలను చెల్లించి, చెరకు రైతులను ఆదుకోవాలని వైసీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడ విలేకరల సమావేశంలో మాట్లాడారు. ఒకప్పుడు జిల్లాలో చెరకు సాగు 90 శాతంగా ఉండేదన్నారు. తెగుళ్లు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో సాగును గణనీయంగా తగ్గినట్టు చెప్పారు. గత ఏడాది గోవాడ ఫ్యాక్టరీకి సరఫరా చేసిన రైతులకు రూ.30 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉందన్నారు. ఎంపీటీసీ సభ్యులు సూరిశెట్టి రమణ, ఇల్ల నాగేశ్వరరావు, దాసరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

13న నరవ ఐటీఐలో అప్రంటిస్ మేళా

కంచరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నరవ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 13న నేషనల్ అప్రంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో డాల్ఫిన్స్ హోటల్స్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్, వీర రాఘవులు కన్‌స్ట్రక్షన్స్, ఆర్‌సీఎల్, యునైటెడ్ హార్డ్‌వేర్, సంపత్ హైడ్రో టెక్నాలజీస్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బయోడేటాతో ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9398785720 నంబరులో సంప్రదించాలన్నారు.

18 నుంచి చెకుముఖి సైన్స్ సంబరాలు

రోలుగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముఖి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్టు వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రోలుగుంటలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

▸ అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవంలో డాక్టర్ నాగమణి



ఆరోగ్య దినోత్సవంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి నాగమణి

మునగపాక, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎం.నాగమణి సూచించారు. పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే జాగ్రత్తలపైనే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడు శరగడం పరదేశినాయుడు మాట్లాడుతూ ప్రహ్లాదుడు, అభిమన్యుడు వంటి వీరత్వం కలిగిన సంతానం కలగడానికి వారి తల్లులు పాటించిన భక్తిభావమే కారణమన్నారు. గర్భిణులు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ మళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ బోర్డు డైరెక్టర్‌కు అభినందన

ఎమ్మెల్యే సుందరపు, ప్రగడలను మర్యాదపూర్వకంగా కలిసిన స్రవంతి



ఆలయ బోర్డు డైరెక్టర్ స్రవంతిని అభినందిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి ఆలయ బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి శుక్రవారం ఎమ్మెల్యే విజయకుమార్, రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్యుతాపురం టీడీపీ కార్యాలయంలో ప్రగడను, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను అతని స్వగృహంలో ఆమె కలిసి తనకు డైరెక్టర్ పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని ఆమె సత్కరించగా, వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి శివ, బీలా లక్ష్మణరావు, జనసేన నాయకుడు ఎ.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం

▸ ఎలక్ట్రికల్ వస్తువుల ప్రదర్శనలో జీఎస్టీ అధికారి రామకృష్ణ



మంగవరం రోడ్డులో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీతో ధరలు తగ్గడంతో శుక్రవారం వివిధ కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు ఎలక్ట్రికల్ వస్తువుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మంగవరం రోడ్డులోని దాసరి గున్నయ్యశెట్టి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎంఆర్.ప్రసన్నకుమార్, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా గృహోపకరణాలు, ఇతర వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లిలో...

నక్కపల్లి : జీఎస్టీ తగ్గించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదని జీఎస్టీ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎల్.రామకృష్ణ అన్నారు. నక్కపల్లిలో ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చిందన్నారు. ప్రధానంగా పలు సామగ్రి కొనుగోలు చేసే వినియోగదారులకు భారం తగ్గుతుందన్నారు. ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతి రావు, సచివాలయ ఉద్యోగులు సున్న శ్రీను, ఎస్.నాని తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టండి

▸ ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కాంతారావు

▸ పాఠశాలలు, అంగన్‌వాడీలు, రేషన్ డిపోల తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సభ్యుడు కాంతారావు

పాయకరావుపేట/నక్కపల్లి/ఎస్.రాయవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఫుడ్ కమిషన్ సభ్యుడు డాక్టర్ వి.కాంతారావు సూచించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ ససందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రేషన్ డిపోలను తనిఖీలు చేశారు. అలాగే రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం బాగా పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోయినా, రేషన్ డిపోలలో సరకులు సకాలంలో ఇవ్వకపోయినా ఆధారాలతో ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఎస్.రాయవరంలో ఓ డిపో తెరిచిలేకపోవడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బియ్యం కింద ఉంచడం, ధరల పట్టికలో ధరలతో పాటు స్టాక్ వివరాలు రాయకపోవడంతో సంబంధిత డిపోలకు మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పాయకరావుపేట తహశీల్దార్ ఎస్ఏ మహేశ్వరరావు, సీఎస్‌డీటీ గణపతిరావు, ఆర్ఐ త్రినాథ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, నక్కపల్లి ఎంఈవోలు కె.నరేశ్, రుత్తల నాగన్నదొర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, ఎస్.రాయవరం సీఎస్‌డీటీ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

17న ఏయూలో అకడమిక్ కాన్ఫరెన్స్

▸ ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాల యం నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ ల్యాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) సహ కారంతో ఈనెల 17న ఎన్ఎస్‌టీఎల్ అకడమిక్ కాన్ఫరెన్స్-2025 నిర్వహించనున్నట్టు ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్ర హం వర్గీస్ తెలిపారు. ఏయూ పాలకమండలి సమా వేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వీసీ రాజశేఖర్‌తో కలిసి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్ - అకడమియా సినర్జీ ఫర్ ఇండిజీనియస్ అండ్ సెల్ఫ్ రిల యెంట్ నావల్ టెక్నాలజీస్ అంశంపై బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. రక్షణ రంగ పరిశోధనల్లో విశ్వవిద్యాల యాల భాగ స్వామ్యం, సహకారం పెంపొందించడమే లక్ష్యమన్నారు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశో.దనా ప్రాజెక్టులపైన, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కు సంబంధించిన ఫండింగ్ లభించే అవకాశాలను చర్చిస్తామన్నారు. వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్ విభిన్న పరిశోధనా కేంద్రాల నుంచి నిపుణులు సదస్సులో పాల్గొంటారన్నారు. శతాబ్ది ఉత్సవాల సమయంలో ఇటువంటి సాంకేతిక కార్యక్రమం నిర్వహణతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు జాతీయ విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది పాల్గొన వచ్చన్నారు.

అనంతరం ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త టి.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రారంభ కార్య క్రమం, కీలకపోన్యాసం అనంతరం మొదటి సెషన్‌లో ఎన్ఎస్‌టీలకు సంబం ధించిన వివిధ ప్రాజె క్టులపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్ఆర్‌బీ సెషన్ నిర్వహిస్తామ న్నారు. మధ్యాహ్నం నుంచి పరిశోధన సమస్యలపై శాస్త్రవేత్తలు, భట్నాగర్ అవార్డు గ్రహీతలు ప్రసంగిస్తారన్నారు. బేసిక్ రీసెర్చ్ ప్రోటోటైప్ తయారీ నుం చి పూర్తిస్థాయిలో సాంకేతికాభివృద్ధిని వాస్తవ రూపంలో తీసుకురావడానికి విభిన్న అంశాలపై నిపుణులు వివ రిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి వెలుగు వీవోఏల కృతజ్ఞతలు

▸ వైసీపీ హయాంలో మూడేళ్ల కాల పరిమితితో సర్క్యులర్ విడుదల

▸ ఎట్టకేలకు చంద్రబాబు పాలనలో రద్దుతో అందరిలో ఆనందం



ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్న వీవోఏలు

మునగపాక, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన సర్క్యులర్‌ను నిలుపుదల చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ వెలుగు వీవోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వీవోఏల కాలపరిమితి మూడేళ్లకు పరిమితం చేస్తూ సర్క్యులర్ విధించిందన్నారు. నాటి నుంచి దీనిని వెనక్కి తీసుకోవాలని పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. తమ పరిస్థితులను అర్థం చేసుకుని కూటమి ప్రభుత్వం సదరు సర్క్యులర్ నిలుపుదల చేయడం సంతోషకరమని వివరించారు. ఈ సమావేశంలో వీవోఏలు పొలమరశెట్టి ఉష, లక్ష్మి, దుంగ ధనలక్ష్మి, దాడి జగది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



క్విజ్ పోటీ విజేతకు బహుమతి అందిస్తున్న డీఐఈవో వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఐఈవో వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ముఖ్యంగా ఈ దశనుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో జోష్ పుట్టించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

12న బీసీవై పార్టీ అధినేత పర్యటన

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించేందుకు ఈ నెల 12న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పర్యటించనున్నారు. ఈ నెల 5న రాజయ్యపేట వచ్చేందుకు ఆయన ప్రయత్నించగా రాజమహేంద్రవరంలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో సమస్య తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజయ్యపేట వెళ్లడానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా హైకోర్టును ఆయన ఆశ్రయించారు. హైకోర్టు నుంచి అనుమతులు రావడంతో ఆదివారం గ్రామానికి వచ్చి మద్దతు ప్రకటిస్తారని మత్స్యకార సంఘ ప్రతినిధులు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

గొడిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు పలు రంగాల్లో ఎంతో శిక్షణ ఇస్తున్న ప్రత్యేక బోధనా ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ సేవలను ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, హెచ్ఎం సత్యకుమార్ అభినందించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఒత్తిడి, ఆందోళన, నిద్రాభంగం వంటి సమస్యలను ఎలా అధిగమించాలో డిప్యూటీ డీఈవోకు యాస్మిన్ వివరించారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

'చెర్లోపాలెం సచివాలయానికి కార్యదర్శిని నియమించాలి'

మునగపాక, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చెర్లోపాలెం సచివాలయానికి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలని ఉప సర్పంచ్ బోజా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటైన గ్రామ సభను ఉప సర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయి కార్యదర్శి లేకపోవడం వలన పనులు జరగడం లేదన్నారు. సమాచార లోపం కూడా కనిపిస్తోందని తెలిపారు. ఈ అంశాలపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

రామన్నపాలెంలో ఎక్స్‌కవేటర్ దగ్ధం

మాకవరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెంలో ఎక్స్‌కవేటర్ దగ్ధమైంది. గ్రామస్థుడు శంకరరావుకు చెందిన ఇటీవల దసరా ముందు శెట్టిపాలెం శివారు రాజుపేటలోని మామిడి తోటల్లో తుప్పలు తొలగించాలని ఎక్స్‌కవేటర్‌ను తీసుకువెళ్లారు. దసరా తర్వాత తుప్పలు తొలిగించాలని తోట యజమాని చెప్పడంతో, ఎక్స్‌కవేటర్‌ను అక్కడే వదిలివేశారు. శుక్రవారం ఉదయం ఎక్స్‌వేటర్ దగ్ధమై ఉండడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మార్కెట్ కమిటీ పాలకవర్గం శనివారం ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో ప్రమాణ స్వీకారం చేయనుంది. ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి మార్కెట్ కమిటీ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

దుర్గమాంబ ఆలయంలో ఎమ్మెల్యే 'బండారు' పూజలు


అమ్మవారి దర్శనం అనంతరం ఎమ్మెల్యే బండారుకు ఆలయ కమిటీ సత్కారం

లంకెలపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79 వార్డు లంకెలపాలెంలో గల దుర్గమాంబ ఆలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మెన్ సుందరపు అప్పారావు, స్థానిక నాయకులు యర్రా కోటేశ్వరరావు, చెలపరెడ్డి రామారావు, దాసరి రామారావు, బొండా అప్పారావు, కర్రి అప్పారావు, కాశీరావు, యలమర్తి వెంకటరావు, గుర్రం నాయుడు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు


సమావేశానికి హాజరైన కూటమి నాయకులు

కొత్తూరు, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలో తుమ్మపాల మీదుగా దిబ్బపాలెం, ఊడేరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రూ.మూడు కోట్లు మంజూరు చేశారని జనసేన నాయకుడు చదరం నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు తెలిపారు. రింగు రోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కొణతాలను కోరిన నేపథ్యంలో ఈ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గంగుపాం జగదీష్, పీలా అప్పారావు, పీలా ఉషా, కరణం రాము, నూకరాజు, తాతారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం'


సమస్యలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారిణి సుభాషిణి

కశింకోట, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిణి వి.సుభాషిణి హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖరరావు, ఆర్ఐ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళా సమాఖ్య సభ్యులు వ్యాపారాల్లో రాణించాలి'


శిక్షణలో మాట్లాడుతున్న ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నాగరాజు

సబ్బవరం, అక్టబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య సభ్యులు వ్యాపార రంగంలో రాణించాలని మండల మహిళా సమాఖ్య అడిషినల్ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్‌పై శుక్రవారం ఇక్కడ సదరు సభ్యులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వ్యాపారాల అభివృద్ధికి ఇటువంటి శిక్షణ శిబిరాలు దోహదపడతాయాన్నరు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ విధిగా ఉద్యమం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాపారాల్లో పాటించాల్సిన మెలకువలు, బ్యాంకుల రుణాలు తదితరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ డి.శ్రీవిద్య, ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల కాల పరిమితి సర్క్యులర్ నిలిపివేతపై హర్షం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా వెలుగు వీవోఏల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ నిలిపివేయడం పట్ల ఏపీ వెలుగు వీవోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. వెలుగు వీవోఏలు మూడు సంవత్సరాల కంటే ఎక్కువగా ఉండకూడదని గత ప్రభుత్వం తీసుకువచ్చిన సర్క్యులర్‌ను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల సంఘం ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, రూపాదేవి, వెంకటలక్ష్మి తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తుమ్మపాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకుడు కోన లక్ష్మణ కోరారు. శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను తీవ్రంగా మోసగించిందని ఆరోపించారు. సంక్షేమ బోర్డు నిధులను వివిధ పథకాలకు మళ్లించి సదరు కార్మికులకు మొండి చేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలకులు వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను జమచేయాలని, మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు బీమా సొమ్ము అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అంతర్ వర్సిటీల యోగా పోటీలకు డైట్ విద్యార్థిని ఎంపిక


శ్రీవైష్ణవి అభినందనలో రత్నాకర్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరు స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్ యూనివర్సిటీలో నవంబరు 24 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు డైట్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. ఈ నెల తొమ్మిదో తేదీన జేఎన్‌టీయూలో జరిగిన అంతర్ కళాశాలల యోగా పోటీలకు హాజరైన ఎం.శ్రీవైష్ణవి అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకం సాధించింది. అంతేకాకుండా ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు అర్హత సాధించింది. దీంతో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.ఫణిబాబు, సీఎస్ఎం విభాగాధిపతి ఎ.గోపాలమ్మ తదితరులు శుక్రవారం ఆమెను అభినందించారు.

ప్రయాణం.. భయం..భయం..

▶▶ అధ్వానంగా పరవాడ- గాజువాక ప్రధాన రహదారి ▶▶ పలు చోట్ల గుంతలు ▶▶ తరచూ ప్రమాదాలు ▶▶ రాకపోకలకు హడలిపోతున్న వాహనదారులు


పరవాడ మండల పరిషత్ కార్యాలయ జంక్షన్ వద్ద ధ్వంసమైన రహదారి


ఎస్సీ బాలికల వసతి గృహం సమీపంలో రహదారి దుస్థితి

పరవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరవాడ-గాజువాక ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ జంక్షన్ నుంచి బంగ్లా జంక్షన్ వరకు మరింత దారుణంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదే రహదారి గుండా గాజువాక, విశాఖపట్నం, అచ్యుతాపురం సెజ్, ఫార్మా సిటీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు పరవాడ, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, స్టీల్ ప్లాంట్, జాజులవానిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఇటుగా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో లారీలు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిపై గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదమరచి ఈ రహదారి గుండా ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసేందుకు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

▶▶ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

▶▶ సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చిత్రపటానికి పాలాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విజనరీ నేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు స్వీకరించి శుక్రవారంతో 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుద్ద మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా హైదరాబాద్‌ను చంద్రబాబు ప్రపంచ పటంలో నిలిబెట్టారన్నారు. నవ్యాంధ్ర సీఎంగా అమరావతిని విజన్-2047 లక్ష్యంతో ప్రపంచ పటంలో నిలిపేందుకు అహర్నిశలూ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం టీడీపీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు.

పాడి సంపద వృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

▶▶ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ


పశువైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాడి సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. మొగలిపురంలో పశు సంవర్ధక శాఖ, పశుగణా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ చికిత్సా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. వీటిపై వైద్య శిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై పాడి రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ ఉషాకుమారి, డాక్టర్ జి.అరుణ, డాక్టర్ బి.సధ్య, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ, ఎంపీటీసీ సభ్యులు తమరాన బంగారునాయుడు, గ్రామ పెద్దలు తమరాన సత్యనారాయణ, అంగటి నానాజీ, మేడిశెట్టి రాము, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

బధిరులను అన్నింటా ప్రోత్సహించాలి

అంతర్జాతీయ బధిరుల వారోత్సవంలో డీఎంహెచ్‌వో హైమావతి


బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి తదితరులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ బధిరుల వారోత్సవాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి మాట్లాడుతూ బధిరులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బధిరుల సంఘం సలహాదారు వి.లక్ష్మి, ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు, ఆశ వర్కర్లు శిక్షణ పొందారు. సైన్ లాంగ్వేజ్ ప్రాముఖ్యత, కమ్యూనికేషన్‌లోని అడ్డంకులను తొలగించే మార్గాలు, బధిరుల హక్కులపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వారోత్సవాల పోస్టర్‌ను అంతా కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

▶▶ తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు


గర్భిణులు, వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రావు

తుమ్మపాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గర్భిణుల బరువు, ఎత్తు తదితరాలను పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. గర్భిణులు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది డి.శారదా, ఎం.మరియమ్మ, చంద్రశేఖర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులు


జీఎస్టీ అక్షరాల నమూనాలో ఆకట్టుకున్న గవరపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం పట్టణంలోని గవరపాలెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వలన కలిగే లాభాలను తెలియజేశారు. నిత్యావసర వస్తువులపై తగ్గిన ధరలను వివరించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు జీవీఎంసీ గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు జీఎస్టీ నమూనాలో కూర్చొని ఆకట్టుకున్నారు. అనంతరం జడ్సీ శారదా నది ఒడ్డున ఉన్న శాంతిగార్డెన్‌ను సందర్శించారు. గార్డెన్‌లో సమస్యలను వాకర్స్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

సుందరయ్యపేటలో...

కశింకోట : సుందరయ్యపేటలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖరరావు హాజరై జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రయోజనాలను వివరించారు. ధరలు తగ్గడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అలాగే అవనీ కంపెనీలో ఉద్యోగులు, సిబ్బందిని కలిసి జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించి, కరపత్రాలను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి గంటి అభిషేక్, ఎ.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ఎంపీడీవో కార్యాలయంలో...

పరవాడ : జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో శుక్రవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారిణి ఎం.సరోజిని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో వస్తువుల రేట్లు, జీఎస్టీ తగ్గింపు తర్వాత రేట్లను వివరించారు. ప్రజలకు ఈ విషయాలను తెలియజేయాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, తహశీల్దార్ బి.నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.మురళీధర్, జీఎస్టీ అధికారులు పి.శ్రీనివాస్, పి.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం ఎంపీడీవో కార్యాలయంలో....

సబ్బవరం : జీఎస్టీ సంస్కరణలు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. సబ్బవరంలో వ్యాపారులు, కార్యాలయ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీఎస్టీ తగ్గడం వల్ల అందుబాటులోకి వచ్చే వస్తువుల ధరలను వివరించారు. ఇన్‌చార్జి ఏవో పీవీ పంతులు, ఈవోపీఆర్‌డీ చైతన్య, కార్యదర్శి వై.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు, కార్మికులు


పరవాడలో ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శనలో ప్రత్యేకాధికారిణి సరోజిని

రైలు ఢీకొని అచ్చియ్యపేట నివాసి మృతి

కొత్తూరు, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి-బయ్యవరం రైల్వే ట్రాక్ మధ్య రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నం జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం అచ్చియ్యపేట గ్రామానికి చెందిన ఉరికిటి శ్రీనివాసరావు (44)ను అనకాపల్లి- బయ్యవరం రైల్వే ట్రాక్‌ల మధ్య శుక్రవారం రైలు ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ధరించిన దుస్తుల్లో ఆధార్ కార్డు, జేబులో పర్సు ఆధారంగా అచ్చియ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నేడు ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుక

కశింకోట, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటై వంద వసంతాలు పూర్తయిన సందర్భంగా కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం విజయదశమి ఉత్సవ్ నిర్వహించనున్నామని ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు అయినాల అప్పారావు, శిష్టి గోపి, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాండిక్స్ ఇండియా కంపెనీ భారత భాగస్వామి పి.సి.దొరస్వామి, యు.గంధర్‌జీ హాజరు కానున్నారని వివరించారు. ఈ వేడుకను అంతా విజయవంతం చేయాలని వారు కోరారు.

వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పరవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రావాడ పంచాయతీ దర్మారాయుడుపేట పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణి, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, పాఠశాల హెచ్ఎం పద్మావతి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ఎస్.రాయవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ నౌషద్, దిమిలి యోగి రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రేవుపోలవరం సముద్రతీరం వద్ద జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. దీంతో వీరిని శుక్రవారం హెచ్ఎం జాన్, వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.


పోటీలకు ఎంపికైన షేక్ నౌషద్, దిమిలి యోగి



ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు పలు రంగాల్లో ఎంతో శిక్షణ ఇస్తున్న ప్రత్యేక బోధనా ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ సేవలను ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, హెచ్ఎం సత్యకుమార్ అభినందించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఒత్తిడి, ఆందోళన, నిద్రాభంగం వంటి సమస్యలను ఎలా అధిగమించాలో డిప్యూటీ డీఈవోకు యాస్మిన్ వివరించారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో ప్రయోజనం

జీఎస్టీ అధికారి ఎల్.రామకృష్ణ


ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదని జీఎస్టీ విభాగం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.రామకృష్ణ చెప్పారు. నక్కపల్లిలో శుక్రవారం ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చిందన్నారు. ప్రధానంగా పలు సామగ్రి కొనుగోలు చేసే వినియోగదారులకు భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు, సచివాలయ ఉద్యోగులు నున్న శ్రీను, ఎస్.నాని తదితరులు పాల్గొన్నారు.

12న బీసీవై పార్టీ అధినేత పర్యటన

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించేందుకు ఈ నెల 12న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పర్యటించనున్నారు. ఈ నెల 5న రాజయ్యపేట వచ్చేందుకు ఆయన ప్రయత్నించగా రాజమహేంద్రవరంలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో సమస్య తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజయ్యపేట వెళ్లడానికి అనుమతులు ఇవ్వాల్సిందిగా హైకోర్టును ఆయన ఆశ్రయించారు. హైకోర్టు నుంచి అనుమతులు రావడంతో ఆదివారం గ్రామానికి వచ్చి మద్దతు ప్రకటిస్తారని మత్స్యకార సంఘ ప్రతినిధులు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

బాణసంచా తయారీ కేంద్రంలో అధికారుల తనిఖీలు

కోటవురట్ల, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండంలోని యండపల్లివలస బాణసంచా తయారీ కేంద్రంలో శుక్రవారం అధికారులు ముమ్మ రంగా తనిఖీలు చేశారు. ఈ కేంద్రాన్ని అధికార యంత్రాంగం ఆకస్మికంగా సందర్శించింది. ఇటీవల కోనసీమ జిల్లా బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ తరుణంలో తహశీల్దార్ తిరుమలబాబు, ఎస్ఐ రమేశ్, నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా నిల్వలు ఉన్నా, జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలను ఎవరూ ఉల్లంఘించకూడదని సూచించారు. ఈ కేంద్రాల్లో తరచూ తనిఖీలు చేస్తామని చెప్పారు.

న్యాయ సహాయకులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాకులు)గా స్వచ్ఛందంగా పనిచేయడానికి ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల న్యాయాధికార సంస్థ కార్యదర్శి పి.షియాజ్ ఖాన్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్హత, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు, ఒక స్టాంప్ సైజు ఫొటో దరఖాస్తుతో జత చేయాలని సూచించారు.





























ఎలక్ట్రికల్ వస్తువుల ఎగ్జిబిషన్

పాయకరావుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో ధరలు తగ్గడంతో శుక్రవారం వివిధ కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు ఎలక్ట్రికల్ వస్తువుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మంగవరం రోడ్డులోని దాసరి గున్నయ్యశెట్టి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎంఆర్.ప్రసన్న కుమార్, కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా గృహోపకరణాలు, ఇతర వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు పాల్గొన్నారు.


జీఎస్టీ ధరల కరపత్రాలు చూపుతున్న అధికారులు, నాయకులు

మెనూ ప్రకారం భోజనాలు పెట్టండి

ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ వి.కాంతారావు

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోల్లో విస్తృతంగా తనిఖీలు

పాయకరావుపేట/నక్కపల్లి/ఎస్.రాయవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఫుడ్ కమిషన్ సభ్యుడు డాక్టర్ వి.కాంతారావు సూచించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ ససందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రేషన్ డిపోలను తనిఖీలు చేశారు. అలాగే రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం బాగా పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోయినా, రేషన్ డిపోలలో సరకులు సకాలంలో ఇవ్వకపోయినా ఆధారాలతో ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఎస్.రాయవరంలో ఓ డిపో తెరిచిలేకపోవడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. బియ్యం కింద ఉంచడం, ధరల పట్టికలో ధరలతో పాటు స్టాక్ వివరాలు రాయకపోవడంతో సంబంధిత డిపోలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పాయకరావుపేట తహశీల్దార్ మహేశ్వరరావు, సీఎస్‌డీటీ గణపతిరావు, ఆర్ఐ త్రినాథ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, నక్కపల్లి ఎంఈవోలు కె.నరేశ్, రుత్తల నాగన్నదొర, సూపర్‌వైజర్ లలిత, ఎస్.రాయవరం సీఎస్‌డీటీ గణపతిరావు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

▸▸ **విశాఖ జిల్లా ఏజీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పుష్పలత**

నక్కపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సమష్టి కృషితో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఏజీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.పుష్పలత సూచించారు. నక్కపల్లిలో అండర్-17 హాకీ క్రీడాకారుల ఎంపికను శుక్రవారం పరిశీలించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. అండర్-17, అండర్-19 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించి నక్కపల్లిలో జరిగిన ఎంపికల్లో 120 మంది హాకీ క్రీడాకారులు పాల్గొనడం సంతోషమన్నారు. రాష్ట్ర స్థాయికి బాలికలు, బాలుర నుంచి రెండు జట్లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులను బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, సెక్రటరీ తాతాజీ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి.రాంబాబు, కోచ్ రాంబాబు తదితరులు అభినందించారు.


హాకీ క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న పుష్పలత

ఖతార్‌లో హోమ్ కేర్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం


మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంచాలకులు షంషున్నీషా బేగం

పాడేరురూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఖతార్ దేశంలోని దోహాలోకేషన్‌లో హోమ్ కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాలకు అర్హులైన మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షంషున్నీషా బేగం కోరారు. హోమ్ కేర్ నర్స్ ఉద్యోగాలకు మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీకి చెందిన 21 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సుగల బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హత కలిగి అనుభవం ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు. వీరికి ఉచిత వసతి, వైద్య, రవాణా సదుపాయం కల్పిస్తారన్నారు. వివరాలకు 98499 01159, 94417 16209, 0891-2502271 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

పశువైద్య శిబిరాలు

అనంతగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల పరిధి భీమవరం, గొట్టిపాడు, గరుగుబిల్లి, గుమ్మకోటల్లో కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 324 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.వ్యాధులు సోకిన వెంటనే సమాచారం అందించాలని కోరారు. పశువులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాగి అప్పారావు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

'హైడ్రో ప్రాజెక్టు రద్దు చేయాలి'

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతుల జీవోలను గిరిజన చట్టాలకు లోబడి రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. బుధవారం కాఫీ కార్మిక నిర్వాసిత రైతులతో సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడారు. హైడ్రో ప్రాజెక్టులతో గిరిజనులు నిరాశ్రయులవుతారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

అధిక నూనె, చక్కెర వినియోగంతో అనారోగ్యం

» సీడీపీవో సీహెచ్ శ్రీదేవి


మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి

చింతపల్లి, అక్టోబరు 10, (ఆంధ్రజ్యోతి): నూనె, చక్కెర అధికంగా వినియోగిస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని జల్లూరుమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ నూనె, పంచదార, ఉప్పు అధికంగా వినియోగించడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రధానంగా ఊబ కా యం, మధుమేహం, రక్తపోటు కలుగుతున్నాయన్నారు. గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. పిల్లలు జంక్‌ఫుడ్స్ అధికంగా తీసుకోవడం వల్ల బాల్యంలోనే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సివస్తోందన్నారు. జంక్‌ఫుడ్స్‌లో రసాయనాలు, ఉప్పు, నూనె, చక్కెర అధికంగా ఉంటుందన్నారు. బాలబాలికలను జంక్‌ఫుడ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ దూరంగా వాటికి ఉండాలే చూసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయాలు, పప్పుధాన్యాలు క్రమంగా ఆహారంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న టీహెచ్‌ఆర్‌ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలామృతం ఏడు నెలలు నిండిన పిల్లలనుంచిమూడేళ్ల వయస్సు వచ్చే వరకు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి. సౌజన్య, ఎం. లక్ష్మి పాల్గొన్నారు.

పాడేరురూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలపై గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో జి.శారదాదేవి సూచించారు. శుక్రవారం మండలంలో కిండంగి సెక్టారు పరిధిలో సేరిబయలు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మహా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు వచ్చేంత వరకు ఐసీడీఎస్ ద్వారా అందించే పోషణ, ఆరోగ్య పరీక్షలు తదితర వాటిపై చేపడుతున్న వెయ్యి రోజుల కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. అనంతరం కిండంగి సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.రాజేశ్వరి, సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీలు, పాల్గొన్నారు.

నేరాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలి

» డీఎస్పీ షెహబాజ్ అహమ్మద్


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ షెహబాజ్ అహమ్మద్

పాడేరురూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న నేరాలపై విద్యార్థినులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ షేక్ షెహబాజ్ అహమ్మద్ సూచించారు. కుమ్మరిపుట్టులోని ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్ ధనలక్ష్మి అధ్యక్షతన ఇంటర్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు.మహిళలపై జరుగుతున్న నేరాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ప్రస్తుతం ఉన్న రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శక్తి యాప్ ఇన్‌స్టాలేషన్, వినియోగం, ఇతర టోల్ ఫ్రీ నంబర్లను వివరించారు. విద్యార్థినులు తమ స్వగ్రామాలకు వెళ్లినపుడు అక్కడి మహిళలకు ఈ చట్టాలపై, రక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కరాటే నిపుణులతో సెల్ఫ్‌డిఫెన్స్‌పై టెక్నిక్స్‌పై ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్థవంతమైన బోధనతోనే ఫలితాలు

» రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కల్పన శైల


మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ కల్పన శైల

హుకుంపేట అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి); విద్యార్థుల కు అర్థమయ్యే రీతిలో బోధనను అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కల్పన శైల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయుల రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ముందుగా లెసన్ ప్లాన్ రూపొందించుకుని విద్యార్థులకు బోధించాలని సూచించారు. గతంలో ఉపాధ్యాయులు సంఖ్య తక్కువ ఉండటంతో సరైన బోధన సాగేది కాదని, ఇప్పుడు తగిన మంది ఉన్న ఉపాధ్యాయులున్నారన్నారు. పిల్లలకు సక్రమంగా బోధన చేయాలని కోరారు. పదో తరగతి పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల్లో ఆట పాటలతో పిల్లలకు బోధించాలన్నారు. పిల్లలు చదువులో రాణించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చెలయ్య, ఎంఈఓ-2 ఈశ్వర్‌రావు, కో ఆర్డినేటర్ శంకరరావు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల కాల పరిమితి రద్దుపై హర్షం


ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న వీవోలు

డుంబ్రిగుడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల మూడేళ్ల కాల పరిమితిని ప్రభుత్వం రద్దు చేయటంపై స్థానిక సంఘ నాయకులు, వీవోఏలు వి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు కూటమి నాయకుల ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు బాలకృష్ణ, శ్రీనివాస్ మాట్లాడుతూగత వైసీపీ ప్రభుత్వం వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితికి సంబంధించిన జీఓను అమలు చేసిందన్నారు.దీని వల్ల మూడేళ్లగా పనిచేసిన వారిని తొలగించే అవకాశం ఉండేదన్నారు. గత ఎన్నికల ముందు హామీ మేరకు కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

ఘనంగా మానసిక ఆరోగ్య దినోత్సవం



పాడేరులో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పాడేరురూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ, సూపరింటెండెంట్ డాక్టర్. హేమలతా దేవి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు సిబ్బందితో ముందుగా విపత్తులు, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీని చేపట్టారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ సైకాలజీ డాక్టర్. టీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ అత్యవసర సమయంలో సైకాలజీ కల్ ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలి అనే విషయాలను వివరించారు. అత్యవసర సాయంపై వైద్య అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసులకు అవగాహనఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, మెడికల్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సుగుణ

అనంతగిరి, అక్టోబ రు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో చిన్నారుల జీవితాలను నాశనం చేయొద్దని స్థానిక తహశీల్దార్ వీరభద్రచారి, ఎంపీడీవో ప్రభాకర్, సీడీపీవో సుగుణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని శుక్రవారం బాల్యవివాహాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంతో వారు మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలతో శరీర, మానసికంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. దీనికితోడు చట్టరీత్యా నేరమన్నారు. పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోని ఏఎస్ఐ రాజంనాయుడు, సూపర్‌వైజర్ సంతోషికుమారి, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమం


కాలేజీ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

సీలేరు, అక్టోబరు 10, (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీ లేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం స్వచ్ఛభారత్ కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రో గ్రాం ఆఫీసర్ డి. శ్రీని వాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలేజీ ఆవరణలో పిచ్చి తుప్పల ను తొలగించి, పరిసరాల్లోని చెత్త, చెదారాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి శంకరరావు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పినకోట రోడ్డులో తుప్పల తొలగింపు

అనంతగిరిఃమండలంలోని పినకోట నుంచి పెదకోట వరకు రోడ్డు ఇరువైపులా పిచ్చిమొక్కలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సర్పంచ్ సిగరం గణేశ్ ప్రత్యేక చొరవతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను జేసీపీ ద్వారా తొలగించారు. అలాగే, కొరపర్తి నుంచి పినకోట వరకు రోడ్డు ఇరువైపులా మొక్కలనూ తొలగిస్తామని సర్పంచ్ గణేశ్ తెలిపారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

హుకుంపేట అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి); మహిళలు టైలరింగ్ నేర్చుకుని స్వయం ఉపాధి పొందాలని అనకాపల్లి రోటరీ క్లబ్ ట్రైనర్ బుద్ద సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలో గరుడపల్లి గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిబ్యాచ్‌లో 60 మందికి నెల రోజులపాటు శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం ప్రొడక్షన్ యూనిట్ కు ఆర్థికంగా చేయూతనిచ్చే విధంగా చేస్తామన్నారు. మెటీరియల్ తామే మార్కెంటింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసరావు సోషల్ వర్కర్ కామరాజు, ట్రైనర్ నీలిమ, సర్పంచ్ బెసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కాఫీ కార్మికుల ఆందోళన



ఏపీఎఫ్‌డీసీ డివిజనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాఫీ కార్మిక సంఘం నాయకులు

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె సమ్మె చేపడతామని సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.కనకవల్లి హెచ్చరించారు. శుక్రవారం ఏపీఎఫ్‌డీసీ డీఎంకి కాఫీ కార్మిక సంఘం నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. డివిజనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ గత ఏడాది నవంబరులో ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం, కాఫీ కార్మికుల సంఘ నాయకులతో చర్చలు జరిగాయన్నారు. పది డిమాండ్ల పరిష్కరిస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చారన్నారు. వీటిలో ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రధానంగా కాఫీ పండ్ల సేకరణ, కూలి రేటు పెంచాలన్నారు. కార్మికులకు 26 రోజుల పనిదినాలు కల్పించాలని, ప్లాంటేషన్ కండక్టర్ల నియామకాలు చేపట్టాలన్నారు. లేకుంటే సమ్మె చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్. సుందరరావు, నాయకులు కన్నానాథం, సుందరమ్మ, కాంతమ్మ, మోరి వెంకటగిరి, రాజారావు, వెంకటేశ్, రామారావు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో విద్యార్థులు రాణించాలి

న్యాయమూర్తి శ్రీభరణి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీభరణి

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలుగుతూ విద్యలో రాణించాలని స్థానిక ప్రథమ శ్రేణి జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం న్యాయమూర్తి డి. శ్రీభరణి అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్ ఫోన్ విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలన్నారు.విద్యార్థులు ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి కుటుంబానికి, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామేశ్వరం, సీనియర్ లాయర్లు రాజరావు, గోవర్ధన్‌గిరి, పారా లీగల్ వలంటీర్ కవడం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొండాపల్లి వీఆర్ఏ మృతి


మృతురాలి కుమారుడికి నగదు అందిస్తున్న వీఆర్ఏలు

పెదబయలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొండపల్లి రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న చెండా శాంతమ్మ (50) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె మృతి పట్ల తహశీల్దార్ త్రినాధరావునాయుడు, డీటీ రంగారావు, ఆర్ఐ పూర్ణయ్య సంతాపం తెలిపారు. సహ వీఆర్ఏలు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం వీఆర్ఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నీలకంఠం, సుందర్‌దేవ్ ఆధ్వర్యంలో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మత్స్యరాజు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గూడెంకొత్తవీధి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్టు దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం సాగులు, ఈతరొబ్బలు, కొట్నాపల్లి గ్రామాల్లో ఆదికర్మయోగి గ్రామ సభలను సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆది కర్మయోగిలో భాగంగా ఆదివాసీల మౌలిక వసతులపై సమగ్ర సర్వే చేపట్టి నివేదిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈనివేదిక ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. పెసా కమిటీ ఉపాధ్యక్షుడు మొట్టడం రాంబాబు, కార్యదర్శి కుమ్మరి రామలింగం, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు కాకూరి శేఖర్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి : సీఐ


సీఐ శ్రీనివాసరావు

జి.మాడుగుల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో మందుగుండు సామగ్రి విక్రయాలపై ముందస్తు చర్యలు చేపట్టనున్నట్టు స్థానిక సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమంగా బాణ సంచా తయారీ, నిల్వలపై ప్రజా రక్షణ దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విక్రయదారులు స్థానిక పోలీసుల అనుమతులు తప్పక పొందాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుపై చైతన్యవంతం కావాలి


ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చింతపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలపై చైతన్యవంతులు కావాలని టీడీపీ నేత రీమల ఆనందరావు అన్నారు. శుక్రవారం చింతపల్లి పంచాయతీ గడపరాయి గ్రామంలో కూటమి నాయకులు అవగాహన కార్యక్రమం, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మాట్లాడుతూ నిత్యవసరాలు, గృహోపకరణాలు, వాహనాలు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, పట్టుపరిశ్రమ, ఉద్యానశాఖ యంత్రాలు, మందులపై ప్రభుత్వం భారీగా జీఎస్టీ తగ్గించిందన్నారు. ఈ సమాచారం తెలుసుకుంటే వ్యాపారుల చేతిలో మోసపోకుండగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కోజు నాగభూషణం, అనిల్ కుమార్, కాసింవల్లి, అప్పారావు, మంగు, పీసా కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన


మాట్లాడుతూన్న ఏపీసీ స్వామినాయుడు

పెదబయలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు తెలిపారు. శుక్రవారం పెదబయలు సీతగుంట జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల -1 లలో జరుగుతున్న టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (తర్ల్) శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరిగిన బేస్‌లైన్ పరీక్షల్లో 50 శాతం మంది విద్యార్థులకు కూడికలు, తీసివేతలు, తెలుగు, ఆంగ్లంలో చిన్న చిన్న పదాలు రాని విషయం గుర్తించామన్నారు. దీంతో కలెక్టర్ దినేష్ కుమార్ చొరవ తీసుకుని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధన మెరుగునకు శిక్షణ అందిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన ఆర్‌పీ, డీఆర్‌పీలతో శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కొమ్ము క్రిష్టమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం


ఎస్ఐ అప్పలసూరిని సన్మానిస్తున్న సీఐ, పోలీసులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ అప్పల సూరి అందించిన సేవలు అభినందనీయమని స్థానిక సీఐ వర ప్రసాద్ అన్నారు. నెల రోజుల క్రితం జిల్లా కార్యాలయానికి బదిలీపై వెళ్లిన అప్పలసూరిని శుక్రవారం స్టేషన్‌లో పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ అప్పలసూరి గిరిజనులతో స్నేహసంబంధాలు కలిగి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారన్నారు. మావోయిస్టుల కార్యకలాపాలను కట్టడి, సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేశ్ పాల్గొన్నారు.

వాహనదారులకు పత్రాలు తప్పనిసరి

డుంబ్రిగుడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు తప్పక రికార్డులు కలిగి ఉండాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని స్థానిక ఎస్ఐ పాపినాయుడు హెచ్చరించారు. డుంబ్రిగుడ, అరకులో ద్విచక్ర వాహనాల, ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలిగాలన్నారు.

జీఎస్టీలో సంస్కరణలు అభినందనీయం

అనంతగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద ఎత్తున మేలు చేకూరుతోందని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీలో సంస్కరణలతో 375 వస్తువులకు భారీగా తగ్గింపు లభించిందన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.15వేల వరకు లబ్ధి చేకూరుతుందని, అలాగే, పీవీటీజీ గిరిజనులకు పీఎం జన్ మన్ పథకంలో ఇళ్ల నిర్మిస్తుందన్నారు.

భారీ వర్షం


అరబీరు గ్రామ సమీపంలో పిడుగుపడి మృతి చెందిన ఎద్దులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు, ఉరు ములు, మెరుపులతో వర్షం పడడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు చోట్ల వాగులు, వంకలు, గెడ్డలు వరదనీటితో ఉధృతంగా ప్రవహించాయి. రహదారులు చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది.

పిడుగుపడి మూగజీవాలు మృతి

మాకవరం పంచాయతీ అరబీరు గ్రామ సమీపంలో సాయంత్రం పిడుగు పాటుకు దుక్కిటెద్దులు మృతి చెందాయి. కె.జయరామ్‌నకు చెందిన నాలుగు, ఎల్. బలరాం, ఎల్.సీతారామ్‌కు చెందిన చెందిన మూడు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. అధికారులు స్పందించి పరిహారమందించాలని చూడాలని వారు కోరుతున్నారు.

కాండ్రంగివలస సమీపంలో కుంగిన కల్వర్టు

» రాకపోకలకు తప్పని ఇబ్బందులు


కల్వర్టు మధ్యకు కుంగిన దృశ్యం

ముంచంగిపుట్టు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబుసాల పంచాయతీ కాండ్రంగివలస సమీప ప్రధాన రహదారిలోని కల్వర్టు శుక్రవారం సగభాగం కుంగిపోయింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రక్కులు అధిక బరువుతో ఈ కల్వర్టుపై నుంచి నిత్యం వెళ్తుండడంతో ఇది కుంగిపోవడానికి ఓ కారణం కావచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం అటుగా నాలుగు చక్రాల వాహనాలు తిరిగేందుకు వీలులేకుండా పోయింది.

నాణ్యతా లోపం.. రెండేళ్లకే శిథిలం

నిర్మాణం పనుల్లో కనీస నాణ్యత పరిమాణాలను పాటించకపోవడంతోనే కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు నిర్మించి రెండేళ్లు కాకుంటే ఇలా శిథిలం కావడంలో కాంట్రాక్టర్ పనితీరు అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యావేక్షణలోపం ఉందని ఆరోపించారు. కల్వర్టు దెబ్బతినడంతో నాలుగు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నట్టు ఆ ప్రాంతానికి చెందిన కె.వెంకట్, కె.ప్రశాంత్, కె.పద్మారావు, ఆర్.భాస్కరరావు, వి.సుందరావులు తెలిపారు.



డి.సురవరం వద్ద చెరువును తలపిస్తున్న రహదారి

నీరు పోయే 'మార్గ'మేది..?

- రహదారుల్లోని గతుకుల్లో నిలిచిపోయిన వర్షం నీరు
- రోజుల తరబడి నిల్వలు.. వాహన చోదకుల అవస్థలు

మాడుగుల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులపై ఏర్పడిన భారీ గతుకుల్లో వర్షం నీరు నిలిచిపోయింది. రోజులు తరబడి ఇది నిల్వ ఉండిపోతోంది. దీంతో వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తోంది. రహదారులపై గతుకుల్లోని నీరు చూసిన వారు అవి మడుగులా, చెరువులా అని ఆశ్చర్యపోతున్నారు. అధికారులు ఈ నీరు ఎటూ పోయేలా చర్యలు చేపట్టకపోవడంతో రోజులు తరబడి అలాగే ఉండిపోతోంది. డి.సురవరం రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి వర్షం నీటితో పూర్తిగా నిండిపోయి చెరువును తలపిస్తోంది. ఈ గొయ్యిలో నీరు పోయేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. గోతులు ఎలాగూ పూడ్చడం లేదు. కనీసం వర్షాలు కురిసేటప్పుడు గతుకుల్లో నీరు లేకుండానైనా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఏఎల్ పురంలో జీఎస్టీపై అవగాహన



ఓ దుకాణంలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

కృష్ణాదేవిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో అల్లూరి వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు జీఎస్టీ ప్రయోజనాలు అందుతున్నాయని, అనేక గృహావసర వస్తువులపై పన్నులు తగ్గాయని చెప్పారు. ప్రజలు జీఎస్టీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వర్తక సంఘం సభ్యులు ఎస్.జోగుబాబు, జోగినాథం, ఉడా రాజా, చెక్కా సంతోశ్, బ్రహ్మాజీ, చక్రి, వర్మ పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఫిర్యాదు చేయండి

- పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ: తహశీల్దార్



పీజీఆర్ఎస్ ఫిర్యాదులను విచారణ చేస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు ఉంటే మండల స్థాయి కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలని తహశీల్దార్ జి.వెంకటరమణ సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పైడిపాల గ్రామానికి చెందిన భూ తగాదాపై ఇరు వర్గాల వారితో మాట్లాడారు. అలాగే కొండలఅగ్రహారం, రామన్నపాలెం, పెద్దిపాలెం, తూటిపాల, బూరుగుపాలెం తదితర గ్రామాల్లో పీజీఆర్ఎస్‌కు వచ్చిన భూ సమస్యలపై విచారణ చేపట్టారు. గ్రామాల్లో భూ సమస్యలు ఉంటే కమిటీ అధ్వర్యంలో పరిష్కరించుకోవచ్చని ఈ సందర్భంగా తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చాయిసుధ, డిప్యూటీ తహశీల్దార్ నూకరాజు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముర్రు ముత్యాలనాయుడు

మాడుగుల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వపు ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు సూచించారు. మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి పలు పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్య సాధనకు ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కళాశాలకు విలువైన పుస్తకాలు అందించిన ముర్రు ముత్యాలనాయుడుకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీఎస్ఎస్ శాస్త్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధకులు పూడి సత్యనారాయణ, కొండలరావు, జి.జయలక్ష్మి, పి.పైడిరాజు, బి.రాజు, డాక్టర్ జె.షర్మిల, డాక్టర్ వి.అప్పలనాయుడు, బి.నారాయణ, ఎం.రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన అవసరం



తడి, పొడి చెత్తను సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో లవరాజు

బుచ్చెయ్యపేట అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలో చిన అప్పన్న పాలెంలో తడి, పొడి చెత్తపై డిప్యూటీ ఎంపీడీవో లవరాజు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో మంచినీటి ట్యాంక్ వద్ద పేరుకు పోయిన తుప్పలు తొలగించారు. ఇళ్ల వద్ద నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న సిబ్బంది పని తీరు పరిశీలించారు. వారికి సూచనలు చేశారు. చెత్త సంపద కేంద్రం పరిశీలించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన అవసరమని గ్రామస్థులకు సూచించారు. అలాగే తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు వేర్వేరుగా అందించాలని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉషా కిరణ్మయి, ఆశ కార్యకర్త, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

నత్తనడకన అన్న క్యాంటీన్ నిర్మాణం

- ఐదు నెలలుగా ముందుకు సాగని పనులు
- అధికారుల వైఫల్యం..అమలుకాని ఎమ్మెల్యే వాగ్దానం

మాడుగుల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మూడు నెలల్లో అన్న క్యాంటీన్ పనులు పూర్తిచేసి పేదలకు రూ.5కు టిఫిన్, భోజన సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ వాగ్దానం నెరవేరడం లేదు. అధికారుల వైఫల్యమో.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో తెలియదుగాని, నేటికి ఐదు నెలలవుతున్నా ఈ భవన నిర్మాణం కనీసం పిల్లర్ల దశకు కూడా చేరకుండా నిలిచిపోయింది. స్థానిక దుర్గాలమ్మ ఆలయ సమీపం షాదిఖానా పక్కన అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి రూ. 65 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో మే 23వ తేదీన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అన్న క్యాంటీన్ ప్రారంభమైతే స్థానిక ఆస్పత్రికి వచ్చే రోగులు, నిత్యావసరాల కొనుగోలుకు మండల వాసులే కాకుండా, పాడేరు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు భోజనం సదుపాయం లభించేది. ప్రస్తుతం మాడుగులలో హోటల్స్ లేవని, ఈ స్థితిలో అన్న క్యాంటీన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అయితే, శంకుస్థాపన నెలన్నరకు తరువాత పనులు ప్రారంభించారు. పునాదులు, పైన పిల్లర్స్ వేసి మట్టితో పూడ్చారు.



పిల్లర్లు కూడా పూర్తికాకుండా ఉన్న అన్న క్యాంటీన్ నిర్మాణం

ఈ నత్తనడక పనులు చూస్తే మూ డునెలల కాదు కదా ఏడాదైనా అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందా? అని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇకనైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్న క్యాంటీన్ పనులు వేగవంతం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పశువుల పెంపకంపై శ్రద్ధ చూపండి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువుల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో రెండో విడత మంజూరు చేసిన గోకులం షెడ్లకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన గోకులం పథకాన్ని, తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్తగా పశువుల షెడ్లకు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మూడు పశువులు ఉన్న వారికి రూ.లక్షా 80 వేలు, నాలుగు పశువులు ఉన్న వారికి రూ.2 లక్షలు చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. డ్వామా పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో మొదటి విడత మంజూరు చేసిన 54 షెడ్లను పూర్తి చేసినట్టు



గోకులం షెడ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చెప్పారు. రెండో విడతగా 72 షెడ్లకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని రైతులను ఎమ్మెల్యే బండారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులపై భారీగా జీఎస్టీ తగ్గుదల

- వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ సింధుప్రియ

నర్సీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ఎలక్ట్రానిక్ పరికరాలపై భారీగా ధరలు తగ్గాయని అచ్యుతాపురం సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంటు కమిషనర్ సింధుప్రియ తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతితో వాణిజ్య పన్నుల అధికారులు కరపత్రాలు ఆవిష్కరించారు. జీఎస్టీ సంస్కరణలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహోపకరణాలైన టీవీలు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, వాషింగ్ మిషన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై 10 శాతం జీఎస్టీ తగ్గిందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల వల్ల వ్యాపారాలు అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. జీఎస్టీ స్లాబులు తగ్గించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం వాణిజ్య వాపార రంగాలకు మంచి అవకాశం ఇచ్చిందన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకుందని తెలిపారు. గతంలో 5, 12, 18, 28 శాతం చొప్పున జీఎస్టీ స్లాబులు ఉంటే, ఇప్పుడు కేవలం 5, 18 శాతం పన్ను రేట్లుహేతుబద్ధీకరణకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పీవీ శైలజ, ఎస్.మంజుల, పి.శ్వేత పాల్గొన్నారు.



జీఎస్టీపై కరపత్రాలు ప్రదర్శిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, కౌన్సిలర్ పద్మావతి

దోమల నివారణకు తెరలు వినియోగించండి

- జిల్లా మలేరియా నివారణ అధికారి వరహాలుదొర

చీడికాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన దోమతెరలను వినియోగించినట్లయితే ప్రాణాంతక దోమల నివారణకు అవకాశం ఉంటుందని జిల్లా మలేరియా నివారణ అధికారి వరహాలుదొర సూచించారు. చీడికాడ శివారు కొండవీధి, గొప్పూరు గిరిజన గ్రామాలను శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ముందుగా కొండవీధి గ్రామానికి వెళ్లి ప్రభుత్వం అందించిన దోమతెరలను పరిశీలించి, వాటిని ఏ విధంగా వినియోగించాలనే అంశంపై గిరిజన మహిళలకు అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తితో కలిగే రోగాల గురించి వివరించారు. అలాగే దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. గ్రామ పెద్దలతో సమావేశమై డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల గురించి వివరించారు. అలాగే గొప్పూరులో మురుగు కాలువలను పరిశీలించి, పారిశుధ్యం మెరుగుపర్చాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ఎస్‌వి.రమణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ, ఏఎన్ఎంలు జి.నాగమణి, ఎస్.సుగుణ పాల్గొన్నారు.



దోమతెరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వరహాలుదొర

ఉపాధి కార్మికులు ఈకేవైసీ తప్పక చేయించుకోండి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులు ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం మండలంలో కొమ్మల్లపూడి పంచాయతీ కేం ద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోకుంటే ఉపాధి కోల్పోతారని చెప్పారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ. ఉపాధి పథకం ఏపీవో వరహాలబాబు పాల్గొన్నారు.

వీవోఏల కాల పరిమితి సర్క్యులర్ నిలిపివేతపై హర్షం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా వెలుగు వీవోఏల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ నిలిపివేయడం పట్ల ఏపీ వెలుగు వీవోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. వెలుగు వీవోఏలు మూడు సంవత్సరాల కంటే ఎక్కువగా ఉండకూడదని గత ప్రభుత్వం తీసుకువచ్చిన సర్క్యులర్‌ను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంపై సంఘం ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

కొత్తూరు, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-బయ్యవరం రైల్వే ట్రాక్ మధ్య రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి విశాఖపట్నం జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం అచ్చియ్యపేట గ్రామానికి చెందిన ఉరికిటి శ్రీనివాసరావు (44)ను అనకాపల్లి- బయ్యవరం రైల్వే ట్రాక్‌ల మధ్య శుక్రవారం రైలు ఢీకొంది. దీంతో అతడు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ధరించిన దుస్తుల్లో ఆధార్ కార్డు, జేబులో పర్సు ఆధారంగా అచ్చియ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ఎస్.రాయవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ నౌషద్, దిమిలి యోగి రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రేవుపోలవరం సముద్రతీరం వద్ద జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. దీంతో వీరిని శుక్రవారం హెచ్ఎం జాన్, వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలిండియా యోగా పోటీలకు అవంతి ఎంపిక

మాకవరపాలెం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా యోగా పోటీలకు అవంతి కాలేజీకి చెందిన కొండాడ నందిని ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మోహనరావు తెలిపారు. తగరపువలసలోని అవంతి కళాశాలలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర కళాశాలల యోగా పోటీల్లో అవంతి కాలేజీ విద్యార్థి నందిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో నవంబరులో బెంగళూరులో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల యోగా పోటీల్లో ఆమె పాల్గొంటారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

దేవరాపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎరువుల దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాడుగులలో మన గ్రోమోర్ దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ శుక్రవారం సందర్శించారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం వరిలో ఆకుముడత, పొడతెగులు, ఆకుముడత, జింకులోపం, సల్ఫర్ లోపం, కాండం తొలుచు పురుగుకు సంబంధించి మందులు షాపులో ఉన్నవి లేనివి పరిశీలించారు. గ్రామ సహాయకులు సలహా మేరకు రైతులు ఎరువులు, పురుగు మందులు వాడాలని ఆమె సూచించారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో

బధిరులను అన్నింటా ప్రోత్సహించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ బధిరుల వారోత్సవాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి మాట్లాడుతూ బధిరులను అన్నిరంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బధిరుల సంఘం సలహాదారు వి.లక్ష్మి, ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు, ఆశ వర్కర్లు శిక్షణ పొందారు. సైన్ లాంగ్వేజ్ ప్రాముఖ్యత, కమ్యూనికేషన్‌లోని అడ్డంకులను తొలగించే మార్గాలు, బధి రుల హక్కులపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వారోత్సవాల పోస్టర్‌ను అంతా కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

నర్సీపట్నం, అక్టోబరు 10 (ఆద్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని సీఐ గోవిందరావు హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా మందుగుండు, బాణసంచా సామగ్రి నిల్వ ఉంచకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధి కార సంస్థలో పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాకులు)గా స్వచ్ఛందంగా పని చేయడానికి ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల న్యాయాధికార సంస్థ కార్యదర్శి పి.షియాజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్హత, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఒక స్టాంప్ సైజు ఫొటో దరఖాస్తుతో పాటు అందజేయాలని ఆయన సూచించారు.

ఐద్వా మహాసభలను విజయవంతం చేయండి

నర్సీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో జరగనున్న ఐద్వా 16వ రాష్ట్ర మహా సభలను విజయంతం చేయాలని సంఘ ప్రతినిధులు కేవీ సూర్యప్రభ, ఎల్.గౌరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కొత్తవీధిలో శుక్రవారం ఐద్వా డివిజన్ యూనిట్ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మహిళలసమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 14, 15, 16 తేదీలలో జరిగే ఐద్వా మహా సభలు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రామన్నపాలెంలో ఎక్స్‌కవేటర్ దగ్ధం

మాకవరపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ఓ ఎక్స్‌కవేటర్ దగ్ధమైంది. గ్రామస్థుడు శంకరరావుకు చెందిన ఇటీవల దసరా ముందు శెట్టిపాలెం శివారు రాజుపేట గ్రామంలోని మామిటి తోటల్లో తుప్పలు తొలగించాలని ఎక్స్‌కవేటర్‌ను తీసుకువెళ్లారు. దసరా తర్వాత తుప్పలు తొలిగించాలని తోట యజమాని చెప్పడంతో, ఎక్స్‌కవేటర్‌ను అక్కడే వదిలివేశారు. శుక్రవారం ఉదయం ఎక్స్‌వేటర్ దగ్ధమై ఉందని చుట్టు పక్కల తోటల్లో ఉన్న రైతులు శంకర్‌రావుకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు తన ఎక్స్‌కవేటర్‌ను దహనం చేశారని, దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని ఎస్ఐ దామోదర్‌నాయుడుకు బాధితుడు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఎక్స్‌కవేటర్‌ను పరిశీలించారు. అనంతరం బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

14న డి.యర్రవరంలో నల్లగొండమ్మతల్లి జాతర



నల్లగొండమ్మతల్లి

నాతవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం గ్రామంలో ఈ నెల 14వ తేదీన గ్రామ ఆరాధ్య దైవం నల్లగొండమ్మతల్లి జాతరను నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. జాతరను పురస్కరించుకుని విజయనగరం వారితో మరకాళ్లపై డాన్స్, విశాఖపట్నం వారితో దూం దడక్, తాడేపల్లివారితో శక్తి వేషాలు, సన్యాసిరాజుపేట వారితో కోలాటం, విశాఖపట్నం వారితో నల్లగొండమ్మతల్లి అమ్మవారిని జోడు గుర్రాల రథంపై ఊరేగింపు, తీన్‌మార్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే డి.యర్రవరంలో రాష్ట్ర స్థాయి గుర్రాల పరుగు పోటీలు కూడా నిర్వహిస్తామని వారు తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కె.కోటపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేజీబీవీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. యునిసెఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాలికలకు వ్యాసరచన, ఉచ్ఛారణ, పలు సాంస్కృతిక పోటీలు కూడా నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మండల స్థాయిలో బహుమతులు అందజేస్తారని ఐసీడీఎస్ పీవో లలితకుమారి తెలిపారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని దేవరాపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సుజాత సూచించారు. బాలికల దినోత్సవం సందర్భంగా కాశీపురం, వేచలం, బేతపూడి కేజీబీవీ పాఠశాలలో క్విజ్, వ్యాచరచన పోటీలు నిర్వహించామన్నారు. బాలికలు ఉత్సాహంగా ముందుకు సాగాలని ఆమె చెప్పారు. ఉపాధ్యాయులు కె.రాంబాబు, పూర్ణిమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోనాం గురుకుల బాలికల పాఠశాలలో బాల్యవివాహాలు, లింగ వివక్షపై శుక్రవారం వ్యాసరచన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు గల బాలికలు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ఉపాధ్యాయులు, కోనాం మహిళ పోలీస్ రొంగలి రమాదేవి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

రోలుగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్టు వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం రోలుగుంటలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18న పాఠశాల స్థాయిలోను, నవంబరు 1న మండల స్థాయిలోను, నవంబరు 23న జిల్లా స్థాయిలోను, డిసెంబరు 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలోను సంబరాలు జరుగుతాయన్నారు. పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రోలుగుంట జడ్పీ పాఠశాల హెచ్ఎం శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ విశాఖ రాక రేపు

» కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం

» సిఫీ టెక్నాలజీస్‌కు శంకుస్థాపన?

» పీఎం పాలెంలో క్రికెట్ మ్యాచ్ వీక్షణం



విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదివారం విశాఖపట్నం వస్తున్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను తిలకిస్తారు. అదేరోజు కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభిస్తారు. ప్రముఖ ఐటీ సంస్థ సిఫీ టెక్నాలజీస్‌కు ఓజోన్‌వేలీలో కేటాయించిన స్థలంలో భూమి పూజ చేస్తారని తెలిసింది. వీటితో మరిన్ని కార్యక్రమాలు ఉన్నాయని, ఖరారు కావలసి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

పరవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గోపాలపట్నంలో నిర్వహించిన అండర్-19 బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థినులు డి.భవ్యశ్రీ, వి.రమ్య, ఎం.రోషిణి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా అనకాపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థినులు వివిధ ఆటల్లో ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా వచ్చే నెల ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.సుహాసిని, పీఈటీ ఎస్.గౌరీ, ఏపీటీ చంద్రకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమతులు ఉంటేనే బాణసంచా తయారీ

» ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, నిల్వ, విక్రయ వంటి కార్యకలాపాలు నిర్వహించే వారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనసీమ జిల్లాలో రెండు రోజుల క్రితం జరిగిన బాణసంచా పేలుడు సంఘటన నేపథ్యంలో జిల్లాలో బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణసంచా తయారీ, నిల్వ, విక్రయం నేరమని అన్నారు.

అధిక వర్షాలతో రబీ పంటలకు మేలు

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్లో విస్తారంగా కురిసిన వర్షాలు.. రబీ సీజన్‌లో పంటల సాగుకు దోహదపడతాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు అన్నారు. శుక్రవారం పరిశోధన స్థానంలో జరిగిన రబీ విత్తన దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో వ్యవసాయ ఖర్చులు తక్కువ, ఆదాయం ఎక్కువ వుంటుందన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాలను ఉపయోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రబీలో పాటించాల్సిన పంటల యాజమాన్య పద్ధతులను సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణమూర్తి వివరించారు. జీవన ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలత, డాక్టర్ భవాని వివరించారు. విత్తన ఉత్పత్తిలో మంచి దిగుబడి సాధించిన రైతులు పీవీటీ రామారావు (తుమ్మపాల), కె.సన్యాసినాయుడు (సాగరం, మాడుగుల మండలం)లను ఏడీఆర్ సత్కరించారు. రైతులకు వైఎల్ఎం 146 రకం నువ్వు విత్తనాలు, జీవన ఎరువులు, జీవన క్రిమిసంహారకాలను అందజేశారు.

2047 నాటికి 50 శాతం పచ్చదనం

» విశాఖ సర్కిల్‌లో నాలుగు నగర వనాలు

» ఎకో టూరిజానికి ప్రోత్సాహం

» పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన వసతులు కల్పిస్తాం

» అటవీ శాఖ విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ దివాన్ మైదీన్



బీఎం మైదీన్

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో భాగంగా విశాఖ సర్కిల్‌లో పచ్చదనాన్ని 50 శాతానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అటవీ శాఖ కన్జర్వేటర్ బీఎం దివాన్ మైదీన్ చెప్పారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖ సర్కిల్ మొత్తం విస్తీర్ణం 23,547 చ.కి.మీ. కాగా 6,574.18 చ.కి.మీ.మేర అడవులు ఉన్నాయన్నారు. అడవులు కాకుండా బయట పచ్చదనం 1650 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉందన్నారు. మొత్తం 8,224.18 చ.కి.మీ (34.92 శాతం) పచ్చదనం ఉందన్నారు. దీనిని 2047కల్లా 11,700 చ.కి.మీ.కు పెంచనున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి భారీగా పచ్చదనం పెంపునకు నిర్ణయించామన్నారు.

ఉత్తరాంధ్రలో కొత్తగా ఎలమంచిలి, నర్సీపట్నం, పాతపట్నం, పాలకొండల్లో నగరవనాలు ఏర్పాటుచేయనున్నామని వెల్లడించారు. పాలకొండలో పది హెక్టార్లలో నగరవనం అభివృద్ధికి రూ.40 లక్షలు, మిగిలిన మూడుచోట్ల 50 హెక్టార్లలో వనాల అభివృద్ధికి రూ.1.5 కోట్లు వంతున ఖర్చు చేస్తామన్నారు. నగర వనాల్లో వాకింగ్, యోగా, ధ్యానం చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తామన్నారు. అడవిలో ఉన్నామనే భావన వచ్చేలా ఏర్పాట్లుచేస్తామన్నారు. అలాగే ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అరకులోయ, అనంతగిరి, లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. వచ్చే నెల నుంచి సముద్రతీర ప్రాంతాలకు తాబేళ్ల రాక ప్రారంభమవుతుందని కన్జర్వేటర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో మూడు లక్షల తాబేళ్ల గుడ్ల రక్షణకు కేంద్రాలు ఏర్పాటుచేశామని, వాటి నుంచి 80 శాతం పిల్లలు బయటకు రాగా సముద్రంలో విడిచిపెట్టామన్నారు. తాబేళ్ల రక్షణకు నెస్టింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు చైతన్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లాలో రూ.3.5 లక్షల కోట్లతో పరిశ్రమలు

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



రావికమతంలో తులసీ కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేశ్

రావికమతం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు జిల్లాలో యువత ఉపాధి కోసం రూ.3.5 లక్షల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శుక్రవారం రావికమతంలో నిర్మించిన తులసి కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఇప్పటికే పాయకరావుపేట నియోజకవర్గంలో 20 వేల ఉద్యోగాలు లక్ష్యంగా మొదటి విడతగా రూ.80 వేల కోట్లతో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టామన్నారు. అలాగే బల్క్‌డ్రగ్ పార్కుతో మరింత మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత చోడవరం బీఎన్ రోడ్డు అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. టి.అర్జాపురం, మేడివాడలలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాల పూర్తికి నిధులు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే కొత్తకోట పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్, గ్రామంలో కల్యాణ మండపం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు కోట సత్యనారాయణ, వెల్లంకి ఈశ్వరరావు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీని కోరారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ మాట్లాడుతూ స్వర్గీయ తులసీరావు ఆకాంక్షలకు అనుగుణంగానే విశాఖ డెయిరీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు, మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరరావు, పాల సంఘం అధ్యక్షుడు గంజి లోవలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రావికమతంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే రాజు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్

వైద్యులు సమ్మెలో ఉన్నా సేవలకు ఢోకాలేదు

» సీహెచ్‌సీల్లో కాంట్రాక్టు వైద్యులతో సేవలు

» డీఎంహెచ్‌వో హైమావతి

» పిచ్చికుక్క కరిచిన విద్యార్థినులకు పరామర్శ



పిచ్చికుక్క దాడిలో గాయపడిన బీసీ హస్టల్ విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

రావికమతం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు సమ్మెలో ఉన్నప్పటికీ జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి హైమావతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. పిచ్చికుక్క కరిచిన హాస్టల్ విద్యార్థినులను పరామర్శించారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన ఎవరూ భయపడవద్దని, తగిన వైద్యం పొందితే పర్వాలేదన్నారు. ఇందుకు తగిన వైద్యాన్ని తామే అందిస్తామన్నారు. గాయపడిన విద్యార్థినులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెట్రిన్ లలితకు సూచించారు. వసతి గృహంలోకి కుక్కల ప్రవేశంపై మెట్రిన్, సిబ్బందిపై ఆమె మండిపడ్డారు. విచ్చలవిడిగా వసతి గృహం లోపలకు కుక్కలు రావడమేమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో హైమావతి విలేకరులతో మాట్లాడుతూ జిలాల్లోని 46 పీహెచ్‌సీలు, 9 సీహెచ్‌సీల్లో వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారన్నారు. ఈ కారణంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వైద్యాధికారులను పీహెచ్‌సీలో నియమించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పీహెచ్‌సీల్లో ముగ్గురు స్టాఫ్ నర్సులు విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రాబీస్, స్నేక్ వెనం టీకాలు అన్ని ఆరోగ్య కేంద్రాలలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్ర స్టోర్లో ఇంకనూ 1400 వ్యాక్సిన్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. సబ్బవరం ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి కె.శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, ఎంఈవో-2 బ్రహ్మాజీ, హెల్త్ సూపర్‌వైజర్ కె.సత్తిబాబు, సీహెచ్‌ఓ హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పాలతో అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

వేసిన విషయాన్ని గమనించ లేకపోవచ్చు. పాము కాటేసిన నిమిషాల వ్యవధిలోనే మగత కమ్ముకుంటుంది. కాటు వేసిన ప్రదేశంలో పాము కోరల గాటు స్పష్టంగా కనిపిస్తుంది. నోటి నుంచి చొంగ, నురగ వస్తాయి. పాము కరిచిన చోట శరీరం తిమ్మిరిగా వుండి, భారంగా మారుతుంది. ఏదో కుట్టిందిలే అని అశ్రద్ధ చేస్తే గంటలోపు ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది.

పాము కాటుకు గురైతే...

పాము కాటుకు గురైన వారు మానసిక ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలి. లేకపోతే రక్తపోటు పెరిగిపోతుంది. రక్త ప్రసరణలో వేగం పెరిగి, పాము విషం త్వరగా గుండెకు, శరీరంలోని ఇతర అవయవాలను చేరుకుంటుంది. పాము కాటేసిన శరీర భాగాన్ని కిందకు ఉంచి, సత్వరమే వైద్యుడి వద్దకు తీసుకు వెళ్లాలి. పాము కరచే శరీర భాగాన్నిబట్టి విషప్రభావం తీవ్రత వుంటుంది. నడుము కిందభాగం, పాదాలు, కాళ్లపై కాటేస్తే ఆపైభాగంలో తాడుతో గట్టిగా కట్టి అర్ధగంటలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి. మెడ, ఛాతి, పొట్టభాగాల్లో కాటేస్తే నేరుగా విషం గుండెకు చేరే ప్రమాదం వుంది. బాధితులను చాలా త్వరగా ఆస్పత్రికి తరలించాలి. ఈలోగా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇస్తే మంచిది. కాటు వేసిన పాము విషపూరితమైనదా? లేదా? అన్న విషయం రక్త పరీక్షల ద్వారా వైద్యులు నిర్ధారిస్తారు. రోగి శరీరం నుంచి తీసిన రక్తం 20 నిమిషాల్లో గడ్డకడితే కాటు వేసిన పాము విష పూరితమైనది కాదని భావించాలి. గడ్డకట్టకపోతే కాటు వేసిన పాము విషపూరితమైనదిగా భావించి అత్యవసర వైద్యం అందిస్తారు.

పాముకాటుకు గురికాకుండా ఉండాలంటే..

నివాస ప్రాంతాల్లో పుట్టలు, పొదలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పొలం గట్లపై ముళ్లపొదలు, గడ్డి లేకుండా చూసుకోవాలి. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు, పైరుకు ఎరువులు/పురుగు మందులు వేసేటప్పుడు మోకాలి వరకు వుండే రబ్బరు బూట్లు ధరించాలి. పశుగ్రాసం కోసేటప్పుడు ముందుగా కొడవలితో అలికిడి చేయాలి. రాత్రిపూట పొలానికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా చేతికర్ర, టార్చ్ తీసుకెళ్లాలి. పొలంగట్లపై నడిచేటప్పుడు కర్రతో చప్పుడు చేయాలి.

మూఢనమ్మకంతో ప్రాణాలకే ముప్పు

వేపాకులో ఔషధ గుణాలు ఉన్నాయనే నమ్మకంతో పాము కాటుకు గురయిన వారి చేత వేపాకులు తినిపిస్తారు. ఇది పాము విషానికి విరుగుడుగా పని చేయదు. ఇంకొంత మంది పాము మంత్రగాళ్ల వద్దకు తీసుకు వెళతారు. విష పూరితమైన పాములు కాటేసినప్పుడు మంత్రాలు, తంత్రాలను నమ్ముకుంటే ప్రాణాలు పోయే ప్రమాదం వుంది. అదే విధంగా నాటు వైద్యాన్ని ఆశ్రయించకూడదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఎస్‌వీలు

డాక్టర్ సిరికి దినేశ్‌కుమార్, సూపరింటెండెంట్, చోడవరం సీహెచ్‌సీ



అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటు నివారణకు యాంటీ స్నేక్ వైల్ (ఏఎస్‌వీ) ఇంజక్షన్లు పీహెచ్‌సీలతోసహా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో వున్నాయి. పాము కాటుకు గురైన రైతులు, కూలీలు లేదా ఇతర వ్యక్తులు మూఢనమ్మకాలను పాటించకుండా వెంటనే ఆస్పత్రికి వస్తే ప్రాణాపాయం తప్పుతుంది.

గోతుల్లో కూరుకుపోయిన లారీలు

... 5వ పేజీ తరువాయి



బురదలో కూరుకుపోయిన లారీ టైరు

స్తంభించాయి. ఇరువైపులా సుమారు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు ఆర్అండ్‌బీ రహదారిపై పలుచోట్ల గోతులు ఏర్పడి దారుణంగా తయారైంది. మాడుగులతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరుతోపాటు పలు మండలాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే అనకాపల్లి, విశాఖ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ రకాల రవాణా వాహనాలు కూడా వెళుతుంటాయి. రహదారిపై ఏర్పడిన గోతులను మెటల్, తారు/సిమెంట్‌తో కప్పకుండా, మట్టిపోసి వదిలేశారు. దీంతో వర్షం కురిస్తే వాహనాలు మట్టిలో కూరుకుపోయి, ట్రాఫిక్ స్తంభిస్తున్నది. శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో మైదాన ప్రాంతం నుంచి ఒక లారీ, మినీ వ్యాను పాడేరు వెళుతున్నాయి. ఎం.కోడూరు వద్ద రోడ్డుపై వున్న బురద గోతుల్లో పక్కపక్కనే దిగబడిపోయాయి. రెండు లారీల మధ్య చిన్నపాటి ఖాళీ మాత్రమే వుండడంతో దిచక్ర వాహనాలు మినహా మరే ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇరువైపులా సుమారు కిలోమీటరు మేర పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారికి ఏం చేయాలో పాలుపోలేదు. వీరిలో కొంతమంది అనకాపల్లి, విశాఖపట్నం నుంచి దూర ప్రాంతాలకు రైళ్లలో వెళ్లాల్సి వారు వున్నారు. తాము ఎక్కడకుండానే రైళ్లు వెళ్లిపోతాయేమోనని ఆందోళన చెందారు. బురదలో కూరుకుపోయిన వాహనాల సిబ్బంది, స్థానికుల సాయంతో ఎక్స్‌కవేటర్‌ను రప్పించి బురదలో నుంచి వాహనాలను బయటకు తీయించారు. సుమారు రెండు గంటల తరువాత వాహనాలు కదిలాయి. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు కంకరరాళ్లను రప్పించి గోతులు కప్పించారు.

భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్ల ముమ్మర సాధన

విశాఖపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో తలపడనున్న భారత్, ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు శుక్రవారం ముమ్మర సాధన చేశారు. కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో గెలుపొందిన ఆస్ట్రేలియా క్రికెటర్లు గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుని హోటల్‌లో బస చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. అలిస్సా హీలీ, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, ఎల్లీస్ పెర్రీ, బెత్ మూనీ, అన్నా బెల్ సదర్లాండ్, ఆష్లీ గార్డనర్, తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వేర్‌హామ్, కిమ్ గార్త్, అలనా కింగ్, మేగాన్, జార్జియా వోల్, హీథర్ గ్రాహమ్, డార్సీ బ్రౌన్, మోలినెక్స్ పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి భారత్ క్రికెటర్లు సాధన చేశారు. కొందరు హోటల్‌కే పరిమితం కాగా కెప్టెన్ హర్మన్ ప్రీత్‌తోపాటు మరికొందరు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు.

క్రైం... crime news

ఆర్టీసీ బస్సు ఢీకొని వైసీపీ నేత మృతి



ఇంజరపు వెంకటరావు (ఫైల్‌ఫొటో)

అనకాపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలో నెహ్రూచౌక్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పట్టణంలోని వేల్పులవీధికి చెందిన వైసీపీ నాయకుడు ఇంజరపు వెంకటరావు (72) ప్రస్తుతం మిరియాల కాలనీలో నివాసం వుంటున్నారు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై నెహ్రూచౌక్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కిందపడిపోయిన ఆయనపైనుంచి టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్తంభించిన ట్రాఫిక్‌ను సీఐ ఎం.వెంకటనారాయణ క్రమబద్ధీకరించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ డ్రైవర్ పరారయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులు వచ్చి ఆందోళనకు దిగారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పడంతో శాంతించారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా వెంకటరావు మృతిపట్ల వైసీపీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు సంతాపం తెలిపారు.

17 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

ఎలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీసులు 17 కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేశారు. రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని షేకిళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న ఒక ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంపై ప్రయాణిస్తున్న వారి వద్ద 17 కిలోల గంజాయి లభ్యమైంది. వీరు తమిళనాడుకు చెందిన ఆర్.సంతోష్ శివం, జె.కార్తీక్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడు తీసుకెళుతున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి



సంఘటన స్థలంలో నుజ్జయిన లారీ

కొత్తూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్ మృతిచెందాడు. అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సీపట్నం మండలం దుగ్గాడ పంచాయతీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన పైలా కిరణ్‌కుమార్ (22) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గంగవరం పోర్టు నుంచి మాకవరపాలెంలో పయనీర్ కంపెనీకి బొగ్గు లోడుతో వెళుతున్న లారీలో వున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున అనకాపల్లి మండలం సిరసపల్లి జాతీయ రహదారిపై ఎడమవైపు నిలిచివున్న సిమెంటు లోడు లారీని ఢీకొన్నది. దీంతో బొగ్గు లారీ క్లీనర్ రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎన్‌హెచ్-5 సిబ్బంది, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి మేనమామ ఎస్.చినబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ చెప్పారు.

తులంన్నర బంగారం చోరీ

కోటవురట్ల, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్‌లో గురువారం ఒక ఇంటిలో తులంన్నర బంగారం చోరీకి గురైంది. ఎస్ఐ రమేశ్ అందజేసిన వివరాల ప్రకారం.. సుంకపూర్ గ్రామానికి చెందిన సింగంపల్లి సన్యాసినాయుడు, భార్య రామా సత్యవతి వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లారు. సన్యాసినాయుడు తల్లి ఇంటికి తాళం వేసి చెవిని మిద్దెపై పెట్టి పొలానికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తలుపులు తీసి వున్నాయి. ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. ఇంట్లో భద్రపరిచిన తులంన్నర బంగారం కనిపించలేదు. చోరీపై సన్యాసినాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

పద్మనాభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిన్నాపురం గ్రామానికి చెందిన సొంగ అప్పారావు (69) గురువారం మేకలు కాయడానికి సారికవాని కళ్లాల వైపు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. శుక్రవారం మధ్యాహ్నం సారికవాని చెరువులో అతని మృతదేహం తేలుతూ కనిపించింది. భార్య ఈశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రౌడీషీటర్ హత్య

... 5వ పేజీ తరువాయి

తరువాత ఇద్దరూ కలిసి కారులో ఎలమంచిలి వైపు బయలుదేరారు. అయితే ఎనిమిదో తేదీ తెల్లవారుజామున దారిలోనే శ్రీధర్‌బాబు మృతిచెందాడు. దీంతో గౌరీశకంర్ కారును అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీలోని మర్రిబంద సమీపంలోని పోలవరం కాలువ వద్దకు తీసుకువెళ్లి, శ్రీధర్‌బాబు మృతదేహాన్ని అక్కడ పడేశాడు. ఇదిలావుండగా విశాఖ ఎంవీపీ పోలీసులు మరో కేసు విషయమై గౌరీశంకర్‌ను తొమ్మిదో తేదీన అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తుండగా...శ్రీధర్‌బాబు మృతి విషయం బయటపడింది. దీనిపై మరింత లోతుగా విచారించగా..మృతదేహాన్ని ఎలమంచిలి సమీపంలో పడేసినట్టు చెప్పాడు. దీంతో గురువారం సాయంత్రం ఎలమంచిలి వెళ్లి, స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వస్తున్నది. శ్రీధర్‌బాబు మృతిగురించి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. ఈలోగా మృతుడి తల్లి, భార్య, పిల్లలు ఎలమంచిలి చేరుకున్నారు. శ్రీధర్‌బాబు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎంవీపీ సీఐ ప్రసాద్ తెలిపారు.

పీపీపీ విధానంపై జగన్‌రెడ్డికి అవగాహన లేదు

... 5వ పేజీ తరువాయి

ఇప్పుడు మెడికల్ కాలేజీలు గుర్తుకొచ్చాయా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులతో..ఎంతో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఆమలు చేస్తున్నారన్నారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు దూసుకుపోతున్నాయని ఎంపీ రమేశ్ కొనియాడారు. జగన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించాలని ఎంత యత్నించినా, ఎవరూ నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి వంకర బుద్ధులు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519